క్లుప్తంగా

అప్రమత్తంగా వ్యవహరించాలి



చిలకలూరిపేటటౌన్: అగ్ని ప్రమాదాలు జరగకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని ఇన్‌చార్జి స్టేషన్ ఫైర్ ఆఫీసర్ ఎస్.భాస్కరబాబు చెప్పారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని కొమ్మినేని సూపర్ స్పెషాలిటీ ఆసుప్రతిలో అగ్ని ప్రమాదం సంభవించినప్పుడు తీసుకోవల్సిన జాగ్రత్తలపై ఆసుప్రతి సిబ్బందికి బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన అగ్ని ప్రమాదం సంభవించినప్పుడు అగ్ని మాపక పరికరాలు ఉపయోగించే విధానాన్ని వివరించారు. అగ్నిమాపక సిబ్బంది ఎస్.వెంకయ్య, కె.శివ నాగేశ్వరరావు, పీవీ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

24న వేల్పూరులో గంగమ్మతల్లి తిరునాళ్ల

శావల్యాపురం: మండలంలోని వేల్పూరు గ్రామంలో వేంచేసియున్న గంగమ్మతల్లి తిరునాళ్ల వేడుకలు ఈనెల 24న వైభవంగా నిర్వహించినట్లు గ్రామస్తులు తెలిపారు. బుధవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో ఎస్సై గల్లా రవికృష్ణ మాట్లాడుతూ తిరునాళ్ల వేడుకలు ప్రశాంతమైన వాతావరణంలో జరిగేలా అందరూ సహకరించాలన్నారు. విద్యుత్ ప్రభలు ఏర్పాటు చేసే నిర్వాహకులు తప్పనిసరిగా ప్రభుత్వ ఆదేశాలు మేరకు పోలీసు నిబంధనలు పాటించటంతో పాటు ముందస్తు అనుమతులు పొందాలన్నారు.

17 వంటగ్యాస్ సిలెండర్లు సీజ్



అమరావతి: అమరావతిలో బుధవారం రెవెన్యూ అధికారులు హోటళ్లు, బేకరీలు, టిఫిన్ సెంటర్లలో తనిఖీలు నిర్వహించి 17 వంట గ్యాస్ సిలెండర్లను స్వాధీనం చేసుకున్నారు. తహసీల్దార్ విజయశ్రీ ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారుల బృందం అమరావతి గ్రామంలోని హోటళ్లు, బేకరీలు, టిఫిన్ టీ సెంటర్‌లలో నిబంధనలకు విరుద్ధంగా ఇళ్లలో వాడుకునే వంట గ్యాస్ సిలెండర్‌లను వాడటాన్ని గుర్తించి వాటిని స్వాధీనం చేసుకుని పౌరసరఫరాలశాఖకు అప్పగించారు. నిబంధనలకు వ్యతిరేకంగా వాడుతున్న వారందరిపైన కేసులు నమోదు చేయాలని తహసీల్దార్ విజయశ్రీ పౌరసరఫరాశాఖ అధికారులను ఆదేశించారు. రెవెన్యూశాఖ సిబ్బందితో పాటుగా పౌరసరఫరాల శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పాలిసెట్ ప్రవేశ పరీక్షకు ఉచిత కోచింగ్

క్రోసూరు: పదవతరగతి పరీక్షలు రాసి పాలిటెక్నిక్ (డిప్లొమా ఇన్ ఇంజినీరింగ్) కోర్సుల్లో చేరాలనుకునే విద్యార్థులు పాలిసెట్ ప్రవేశ పరీక్షకు కావల్సిన ఉచిత కోచింగ్‌ను క్రోసూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆధ్వర్యంలో ఇస్తున్నట్లు ప్రిన్సిపల్ బీవీ.రమాదేవి బుధవారం తెలిపారు. క్రోసూరులోని జెడ్పీపాఠశాల ఆవరణలో గల ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కోచింగ్ తరగతులుంటాయని తెలిపారు. అదేవిధంగా ఉచిత స్టడీమెటీరియల్ అందించబడుతుందని తెలిపారు. ప్రవేశపరీక్ష దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 30వ తేదీ ఆఖరుగా తెలిపారు. మే 10వ తేదీ ఎంట్రన్స్ పరీక్ష ఉంటుందని తెలిపారు. కోచింగ్ తీసుకునే విద్యార్థుల ప్రవేశపరీక్ష దరఖాస్తు అప్‌లోడ్ చేయడం జరుగుతుందని ప్రిన్సిపల్ వివరించారు. కావున క్రోసూరు, పరిసర గ్రామాల పదవతరగతి పరీక్షలు రాసిన విద్యార్థులు ఈ సదవకాశాన్ని సద్వినియోపరుచుకోవాలని కోరారు.

450 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

బెల్లంకొండ: నాటు సారా తయారు చేస్తున్న బట్టీలపై బుధవారం మధ్యాహ్నం ఎస్ఐ కె.అమీర్ ఆధ్వర్యంలో మెరుపు దాడులు చేశారు. మండలంలోని నందిరాజుపాలెం పరిధిలోని అటవీ ప్రాంతంలో దొంగమడుగు అనే ప్రదేశంలో నాటు సారా కాస్తున్నారన్న సమాచారంతో ఎస్ఐ సిబ్బందితో కలిసి దాడి చేశారు. ఈ దాడుల్లో సుమారుగా 450 లీటర్ల బెల్లం ఊటను గుర్తించి, ధ్వంసం చేశారు. సారా తయారు చేస్తున్న సామాగ్రితో పాటుగా ఒక లీటర్ నాటుసారాను స్వాధీనం చేసుకున్నామన్నారు. సారా కాస్తున్న వ్యక్తులు తాము వస్తున్నామన్న సమాచారంతో పరారైనట్లు పేర్కొన్నారు. ఎస్ఐ వెంట కానిస్టేబుళ్లు రాజేష్, ఎల్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పరిపాలన క్షేత్రస్థాయికి తీసుకెళ్లిన చరిత్ర జగనన్నది

- అర్హత ఉంటే చాలు.. అందరికీ సంక్షేమ పథకాలు
- వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని



ప్రజలకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న మంత్రి విడదల రజిని

చిలకలూరిపేట: జగనన్న పాలనలో ప్రజలకు చేసిన మేలు చెప్పేందుకు సగర్వంగా ప్రజల్లోకి వెళుతున్నామని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని వెల్లడించారు. మండల పరిధిలోని మురికిపూడి గ్రామంలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ ప్రజలకు ప్రభుత్వం చేస్తున్న మేలు గురించి వివరించారు. ఎవరు ఏ పథకం ద్వారా లబ్ధి పొందారో తెలియపరిచారు. ఈ సందర్భంగా మంత్రి విడదల రజిని మాట్లాడుతూ ఇచ్చిన హామీలను సమర్థవంతంగా అమలు చేసి ధైర్యంగా ప్రజల్లోకి వెళుతున్నామని చెప్పారు. ముఖ్యమంత్రి స్థానంలో వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అనే మహోన్నత వ్యక్తి ఉండబట్టే ఇది సాధ్యమైందని వివరించారు. ఇచ్చిన మాట పల్లెత్తు పోకుండా ఒక్కో హామీని నెరవేర్చుకుంటూ తమ ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. ఇప్పటికే 98 శాతానికి పైగా హామీలను నెరవేర్చగలిగామని చెప్పారు. విశ్వసనీయత, అంటే ఇదేనని, రాష్ట్రంలో జగనన్నకు మించిన విశ్వసనీయత మరే నాయకుడికి లేదని తెలిపారు. పరిపాలనను క్షేత్రస్థాయికి తీసుకువెళ్లి చరిత్ర సృష్టించారని చెప్పారు. అర్హత ఉంటే చాలు ఎలాంటి సంక్షేమ పథకమైనా అందరికీ అందాల్సిందే అనే నినాదంతో తమ ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు. ఇప్పుడు ఏపీలో అమలౌతున్నన్ని సంక్షేమ పథకాలు గతంలో ఎప్పుడూ అమలు కాలేదని చెప్పారు. వార్డులకు, గ్రామగ్రామానికి సచివాలయాలను తీసుకొచ్చి ప్రజలకు ప్రభుత్వ సేవలను అత్యంత సులభతరం చేశారని వివరించారు. గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలు అడుగడుగునా నీరాజనాలు పలుకుతున్నారని, ప్రభుత్వానికి సంపూర్ణ మద్దతు లభిస్తోందని చెప్పారు. ఇదంతా జగనన్న చారిత్రక పాలన వల్లనే సాధ్యమైందన్నారు. ఇలాంటి ప్రభుత్వం పదికాలాల పాటు మనుగడ సాగించాలని ప్రజలు మనస్ఫూర్తిగా కోరుకుంటున్నారని, దీనికి ఉదాహరణ వారి నుంచి గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమానికి లభిస్తున్న ఆదరణే నిదర్శనమని పేర్కొన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తోట రాజేంద్రప్రసాద్, గ్రామ సర్పంచ్ ఉసర్తి భూలక్ష్మి, ఉప సర్పంచ్ కొమ్మనబోయిన రామకృష్ణ రాజు, వైస్ ఎంపీపీ సూరబోయిన ఆదిలక్ష్మి, మురికిపూడి పీఏసీఎస్ అధ్యక్షుడు ఆరుమళ్ల వెంకటశివ, ఎంపీటీసీ సభ్యులు జమ్మలమడక సూర్యప్రకాశరావు, వైఎస్సార్ సీపీ నాయకులు ఉసర్తి రాంబాబు, కొమ్మనబోయిన చెంచురాములు, బోడి సాంబయ్య, గోగు ముక్కంటి, దాసరి హనుమంతరావు, జాష్టి సూరయ్య పాల్గొన్నారు.

బీసీలకు 50 శాతం సీట్లు కేటాయించాలి

ఏపీ బీసీ సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షులు కేశన డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న కేసన శంకర్‌రావు

నరసరావుపేట: రాష్ట్రంలో రానున్న సార్వత్రిక ఎన్నికలలో అన్నీ రాజకీయ పార్టీలు బీసీలకు 50 శాతం ఎమ్మెల్యే, ఎంపీ స్థానాలు కేటాయించాలని ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకర్‌రావు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక బీసీ సంక్షేమ సంఘంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. శంకర్‌రావు మాట్లాడుతూ రానున్న ఎన్నికలలో ఏదైనా ఒక రాజకీయపార్టీ బీసీకి ఒకస్థానాన్ని కేటాయిస్తే అదే అసెంబ్లీ స్థానంలో మిగతా రాజకీయ పార్టీలు కూడా బీసీలకే కేటాయించాలని అన్నారు.

ఓసీలకు కేటాయించినచోట బీసీలకు సీట్లు కేటాయించి కావాలనే ఓటమి చెందే పాలుగా కొన్ని రాజకీయ పార్టీలు తప్పుడు విధానాలు అనుసరిస్తున్నాయన్నారు. దేశంలో వెన్నుముక కులాలుగా ఉన్న బీసీలకు కుల జనగణన చేయలేక పోయారన్నారు. కులాల వారీగా లెక్కలు తేలితే జనాభా ప్రాతిపదికన బీసీ కులాల వారికి విద్యా, ఉద్యోగం, ఉపాధి, నిధులు, పదవులు రిజర్వేషన్ ప్రకారం దక్కుతాయన్నారు. ఇటీవల కుల జనగణనపై ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక కమిటీని ప్రకటించటంపై బీసీ సంక్షేమ సంఘం తరపున హర్షం వ్యక్తం చేశారు. బీసీ కులాలలో నాలుగు ఐదు కులాలు మాత్రమే రాజ్యాధికారం అనుభవిస్తున్నారని, సుమారు 125 కులాలు ఇప్పటికీ అసెంబ్లీలోకి అడుగుపెట్టలేదన్నారు. సమావేశంలో రాష్ట్ర యువజన అధ్యక్షులు కుమ్మర క్రాంతికుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అన్నవరపు నాగమల్లేశ్వరరావు, రాష్ట్ర అధికార ప్రతినిధి బాదుగున్నల శ్రీను, మండల అధ్యక్షులు నాగారపు గురు ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

సంకురాత్రిపాడులో మానమ్మకం నువ్వే జగనన్న



నాదెండ్ల: మండలంలోని సంకురాత్రిపాడు గ్రామంలో బుధవారం మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమం నిర్వహించారు. గ్రామ వలంటీర్లు, గృహ సారథులు, కన్వీనర్లు, పార్టీ నాయకులు ఇంటింటికీ తిరిగి గడిచిన నాలుగేళ్ళలో ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. గృహ యజమానుల అనుమతితో జగన్‌మోహన్‌రెడ్డి స్టిక్కర్‌ను అంటించారు. కార్యక్రమంలో సర్పంచ్ జెట్టి నాగమణి, నాయకులు జెట్టి బొల్లయ్య, శివలక్ష్మీనారాయణ, కట్టెబోయిన వీరాస్వామి, పత్తి వెంకట్ పాల్గొన్నారు.

ఆశాజనకంగా రబీ సీజన్

- నాడు కరువు భూమి–నేడు అన్నపూర్ణ దేవి
- పల్నాడులో 19,076 హెక్టార్లు వరి సాగు



వరికోత మిషన్‌తో కోత కోయిస్తున్న రైతులు



కూలీలతో ధాన్యంను బస్తాల్లోకి ఎత్తించిన రైతులు

గురజాల: పల్నాడు ప్రాంతంలో గతంలో ఎటు చూసినా బీడు భూములు దర్శనమిచ్చేవి..కానీ నేడు ఆ పరిస్థితి పూర్తిగా వ్యతిరేకంగా కనిపిస్తోంది. పచ్చని పంట పొలాలతో రైతులు పొలాల్లో బీజీగా ఉంటున్నారు. గతంలో ఒక్క పంట వేయడానికి కూడా రైతులు ఆలోచించేవారు ...కానీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రైతుల సంక్షేమం కోసం వ్యవసాయంలో ఎన్నో సంస్కరణలు తీసుకువచ్చి రైతే రాజు అనే విధంగా పాలన అందిస్తున్నారు. గతంలో ఒక్క పంట సాగు చేయడానికి కాలువల్లో నీరు లేక వరి పంట ఎండిపోయి దర్శనమిచ్చేవి. కానీ నేడు మాత్రం రెండు పంటల్లో కూడా వరి సాగు చేసేందుకు రైతులు ముందుకు వస్తున్నారంటే దానిని బట్టి అర్థమవుతుంది ఈ ప్రభుత్వం రైతులకు ఎంత అనుకూలంగా ఉందోనని . ప్రకృతి సాకారంతో కాలువల్లో సంమృద్ధిగా నీరు ఉండడంతో రబీలో కూడా వరి పంట సాగుకు ఆసక్తి చూపారు. గత ప్రభుత్వ హయాంలో కేవలం బోర్లు కింద మాత్రమే వరి పంటను సాగుచేసేవారు. కానీ నేడు రెండు పంటలు పండించే పరిస్థితులకు రైతులు అభివృద్ధి చెందారంటే కేవలం సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాల వల్లనే ప్రత్యేకించి రైతుల సంక్షేమానికి చేస్తున్న కృషితో పల్నాడు ప్రాంతం అంతా సస్యశ్యామలంగా దర్శనిమిస్తుంది. ఈ ప్రభుత్వం రైతులకు మద్దతు ధర ప్రకటించడంతో పాటు రైతుల సంక్షేమానికి కృషిచేస్తున్నారు. ఒక వైపు ఆశాజనకంగా దిగుబడి..మరోక వైపు మద్దతు ధరలతో అన్నదాతలు ఆనందోత్సాహాల్లో ఉన్నారు.

పల్నాడులో సాగు ఇలా.....

పల్నాడు జిల్లాలో వరిసాగు అధిక ప్రాధాన్యత నిస్తారు. పల్నాడు ప్రాంతంలో గతంతో పోల్చితే ఈ ఏడాది వరి సాగు విస్తీర్ణం పెరిగిందనే చెప్పవచ్చు. రబీ సీజన్‌లో మాచర్ల సబ్ డివిజన్ – 4162 హెక్టార్లు, పిడుగురాళ్ల–8492 హెక్టార్లు, వినుకొండ–1719 హెక్టార్లు, నరసరావుపేట – 2056 హెక్టార్లు, క్రోసూరు – 2177 హెక్టార్లు, సత్తెనపల్లి–458 హెక్టార్లు, మంగళగిరి సబ్ డివిజన్‌లో కేవలం అమరావతి మండలం మాత్రం 12 హెక్టార్లు సాగు చేసినట్లు వ్యవసాయధికారులు వెల్లడించారు.

కోతలు ముమ్మరం...

పల్నాడు జిల్లా వ్యాప్తంగా కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. రబీ సీజన్‌లో పల్నాడు జిల్లాల 19076 హెక్టార్లు సాగు చేయడం జరిగింది. ఇప్పటికి సుమారుగా పల్నాడు జిల్లాలో 25 శాతం వరకు కోతలు కోసి ధాన్యాన్ని పంట పోలాల నుంచి ఇళ్ల వద్దకు చేర్చారు. వరి కోతలకు కూలీల రేట్లు ఆకాశాన్నంటుతుండడంతో కూలీల కొరత కారణంగా రైతులు యంత్రాలతో కోతలు కోయించేందుకు మక్కువ చూపుతున్నారు. తక్కువ ఖర్చుతో గంటల వ్యవధిలో ప్రక్రియ పూర్తివుతుందని , ధాన్యం సైతం ఇంటికి చేరతాయని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

30 శాతం కోతలు పూర్తి



జిల్లాలో వరి కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇప్పటికే ఆయా ప్రాంతాల్లో 30 శాతంకు పైగా వరి కోతలు పూర్తయ్యాయి. ఈ వారంలో వరి కోతలు ఊపందుకుంటాయి. రైతులకు మద్దతు ధర కూడా ప్రభుత్వం ప్రకటించింది. రైతులు ఖరీఫ్, రబీ సాగుల్లో వరి పంటకు ఆసక్తి చూపుతున్నారు. రైతులు వ్యవసాయాధికారుల సూచలను తీసుకుని మంచి దిగుబడులు సాధించాలి.

– వి జగదీశ్వరరెడ్డి, మాచర్ల ఏడిఏ,

సేవాతత్పరుడు కాశీరామారావు

ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి



కాశీరామారావు చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట ఈస్ట్: క్రమశిక్షణ గల సేవాతత్పరుడు కపలవాయి కాశీరామారావు అని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి కొనియాడారు. శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల ఆడిటోరియంలో బుధవారం కళాశాల పాలకవర్గ మాజీ అధ్యక్షుడు కాశీరామారావు 15వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి మాట్లాడుతూ, రాజకీయ, ఆధ్యాత్మిక, వ్యాపార, సాంస్కృతిక, విద్యారంగాలలో 31 పదవులను అలంకరించి ఆ పదవులకే వన్నె తెచ్చిన మహనీయుడు కాశీరామారావు అని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ మిట్టపల్లి రమేష్, కళాశాల పాలకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు కపలవాయి విజయ కుమార్, నాగసరపు సుబ్బరాయ గుప్త, శ్రీ వాసవీ మిత్రమండలి అధ్యక్షుడు చేగు వెంకటేశ్వరావు, లింగంగుంట్ల మాజీ సర్పంచ్ పొన్నపాటి ఈశ్వరరెడ్డి, నల్లపాటి రామచంద్ర ప్రసాదు, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

గణపవరంలో లోఓల్టేజీ సమస్యకు పరిష్కారం

రూ.30 లక్షలతో నాలుగు ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు



శివా గెస్ట్‌హౌస్ సమీపంలో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తున్న విద్యుత్ శాఖ అధికారులు

నాదెండ్ల: మేజర్ పంచాయతీ గణపవరం గ్రామంలో లోఓల్టేజీ సమస్య పరిష్కారానికి విద్యుత్‌శాఖ అధికారులు చర్యలు తీసుకున్నారు. విద్యుత్ వినియోగం పెరగటంతో లోఓల్టేజీ సమస్యతో గ్రామస్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామస్తులు విద్యుత్‌శాఖ అధికారులకు పలుమార్లు ఫిర్యాదులు చేశారు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి రూ.30 లక్షల వ్యయంతో గ్రామంలో నాలుగుచోట్ల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నారు. జాతీయ రహదారి సమీపంలోని శివా గెస్ట్‌హౌస్ వద్ద ఒకటి, పశువుల ఆసుపత్రి సమీపంలో ఒకటి, మసీదు బజారులో ఒకటి, పద్మశాలీల పేటలో ఒకటి చొప్పున ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నారు. బుధవారం శివా గెస్ట్‌హౌస్ వద్ద ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌ను చార్జ్ చేశారు. మరో రెండు రోజుల్లో మసీదు బజారులో ట్రాన్స్‌ఫార్మర్ చార్జ్ చేయనున్నట్లు మండల విద్యుత్ శాఖ ఏఈ ప్రసాద్ తెలిపారు.

ఆరా ఫౌండేషన్ సేవలు అభినందనీయం



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్



విద్యార్థినిని అభినందిస్తున్న ఎంపీ ఆళ్ల అయోధ్యరామిరెడ్డి

చిలకలూరిపేట టౌన్: ఆరా ఫౌండేషన్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ చెప్పారు. బుధవారం మండలంలోని మద్దిరాల గ్రామంలో ఉన్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ప్రగతి నివేదన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరా ఫౌండేషన్ ద్వారా 2015వ సంవత్సరంలో పాఠశాలను అభివృద్ధి చేయటం ప్రారంభించారని, ఆ సంవత్సరంలో కేవలం 26 మంది ఉన్న విద్యార్థులు ప్రస్తుతం 225 మందికి చేరుకున్నారని తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నాడు–నేడు ద్వారా అనేక ప్రభుత్వ పాఠశాలల రూపు రేఖలు మారిపోయాయని చెప్పారు. ప్రభుత్వ పాఠశాల్లో ఇంగ్లిషు మీడియం ప్రవేశపెట్టడం ద్వారా విద్యార్థుల మంచి భవిష్యత్ అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీలు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి, లావు శ్రీ కృష్ణదేవరాయలు, ఆరా మస్తాన్, వైఎస్సార్ సీపీ నాయకులు సుభాని, అబ్దుల్ నబి, నరసింహారావు, సాతులూరి కోటి, రవి తదితరులపాల్గొన్నారు.

నర్సరీ చట్టం నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి

ఉద్యాన శాఖ అధికారిని జనని



షేడ్‌నెట్‌లను పరిశీలించి సూచనలు చేస్తున్న ఉద్యాన శాఖ అధికారిని జనని

సత్తెనపల్లి: నర్సరీ చట్టం నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ఉద్యాన శాఖ అధికారిని సీహెచ్ జనని అన్నారు. సత్తెనపల్లి మండలం వెన్నాదేవి, కంకణాలపల్లి గ్రామాల్లో ఉన్న షేడ్ నెట్ నర్సరీలను బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నర్సరీ నిర్వాహకులు నర్సరీ చట్టం –2010 ప్రకారం నర్సరీ రిజిస్ట్రేషన్, లైసెన్స్ కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. నర్సరీ లైసెన్స్ కోసం షేడ్‌నెట్ చుట్టూ 8–14 అడుగుల ఎత్తు వరకు ఇన్‌సెక్ట్ ప్రూఫ్ నెట్ తో రక్షణ కల్పించాలన్నారు. నెట్ హౌస్ డబల్ డోర్ సిస్టం కలిగి ఉండాలని, నెట్ హౌస్‌లో ఉన్న షేడ్ నెట్ గాని, ఇన్‌సెక్ట్ గాని, కీటకాలు లోపల ప్రవేశించడానికి అవకాశం లేకుండా ఎటువంటి రంధ్రాలు ఉండరాదన్నారు. నారును ప్రోటేలలో నాటి వాటిని ఎత్తైన మడులపై అమర్చాలన్నారు. ప్రోటేలలో శుద్ధి చేసిన కోకోపిట్టు మాత్రమే వాడాలని, శుద్ధి చేయుటకు కోకోపిట్‌కు ఒక కేజీ ట్రైకోడెర్మా విరిడి, ఒక కేజీ సుడోమోనస్ కలపాలన్నారు. నర్సరీ యజమాని విత్తనాన్ని కొనుగోలు చేసినప్పుడు విత్తనాల ప్యాకెట్ మీద విత్తన రకం, లాట్ నంబర్, కంపెనీ యొక్క లేబుల్‌ని గమనించి నాణ్యమైన విత్తనాలు కొనుగోలు చేయాలన్నారు. నర్సరీదారులు ప్రతి ఒక్కరూ లైసెన్స్ కోసం తప్పనిసరిగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. కొత్తగా షేడ్ నెట్ వేసిన నర్సరీలు, రెన్యువల్ చేసుకోవాల్సిన నర్సరీదారులు తప్పనిసరిగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. లైసెన్స్ లేనియెడల, నాసిరకం నారు అందించిన యెడల అటువంటి నర్సరీలపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. నారు ధర అధిక ధరతో రైతులకు విక్రయించిన యెడల తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రైతుభరోసా కేంద్రాల ద్వారా వరి, మొక్కజొన్న కొనుగోళ్లు



వ్యవసాయ, రెవెన్యూ అధికారులతో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్

నకరికల్లు: రబీలో సాగుచేస్తున్న పంటలకు ఈ క్రాప్ నమోదు చేసుకున్న వరి, మొక్కజొన్న తదితర పంటలను ప్రభుత్వం నిర్ణయించిన ధరకు రైతుభరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేస్తామని జిల్లా జాయింట్ కలెక్టర్ ఏ.శ్యాంప్రసాద్ తెలిపారు. మండలంలోని త్రిపురాపురం వద్ద సాగులో ఉన్న పంటలను బుధవారం పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ క్వింటా వరిని రూ. 2,060లకు, క్వింటా మొక్కజొన్నను రూ.1,962లకు మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేస్తామన్నారు. పంటలను విక్రయించదలచుకున్న రైతులు రైతుభరోసా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎస్.సురేష్, మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు, సిబ్బంది పాల్గొన్నారు.

బీకేర్‌ఫుల్!



వైద్యశాలలో వేసవి తాపాన్ని తగ్గించేందుకు విద్యుత్ వినియోగం అధికంగా ఉంటుందని, ఈ నేపథ్యంలో షార్ట్ సర్క్యూట్ వలన అగ్నిప్రమాదం సంభవించినప్పుడు, తీసుకోవలసిన జాగ్రత్తలపై బుధవారం పట్టణంలోని తిరుమల నర్సింగ్ హోమ్ సిబ్బందితో పాటు యాజమాన్యానికి అగ్నిమాపక శాఖ అధికారులు అవగాహన కల్పించారు. ఐసీఎస్ఎఫ్ శ్రీనివాసరావు, డీటీపీ రమణారెడ్డి, ఎల్ఎఫ్‌లు ప్రకాష్‌రావు, వెంకటేశ్వర్లు, ఎఫ్ఎంలు కేశవబాబు, ప్రభాకర్‌రెడ్డి, కోటేశ్వరరావు, మల్లికార్జునరావు పాల్గొన్నారు. –వినుకొండ టౌన్

చల్లని మనసు!



మండల కేంద్రం శావల్యాపురంలో గుంటూరు–కర్నూలు జాతీయ రహదారిలో సుచరిత ఎడ్యుకేషనల్ సొసైటీ చలివేంద్రం అందరి దాహార్తి తీరుస్తోంది. గత పది సంవత్సరాలుగా ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు సొసైటీ కార్యదర్శి కనగాల వెంకట రామమోహన్‌చంద్ తెలిపారు. తాటాకు పందిరిలో ప్రత్యేకంగా మట్టికుండలు ఏర్పాటు చేసి ఉచితంగా మినరల్ వాటర్ అందజేస్తున్నామని వివరించారాయన. – శావల్యాపురం

రంజాన్‌తోఫా పంపిణీ



పేద ముస్లింలను ఆదుకోవాల్సిన బాధ్యత ఎంతైనా ఉందని లోక్‌సత్తాపార్టీ నాయకుడు మాదాసు భానుప్రసాద్ చెప్పారు. బుధవారం పట్టణంలోని రాష్ట్రీయ జనక్రాంతి పార్టీ కార్యాలయంలో పేద ముస్లింలకు రంజాన్‌తోఫా అందించారు. గత ఐదు సంవత్సరాలుగా పేదలకు సహాయం చేస్తున్న రాష్ట్రీయ జనక్రాంతి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ గౌస్‌ను అభినందించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు షేక్ అలీ, మౌలాలి, పఠాన్ హుస్సేన్, అబ్దుల్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు. –చిలకలూరిపేటటౌన్